సాక్షి నిర్మల్

శుక్రవారం ‌। 8 । సెప్టెంబర్‌ । 2023



గణనాథుల ముస్తాబు

విఘ్నాలకు అధిపతిగా పూజలందుకుంటున్న విఘ్ననాయకుడి విగ్రహాలు వినాయక చవితి కోసం ముస్తాబవుతున్నాయి. 2 నుంచి 16 ఫీట్ల విగ్రహాలను రాజస్థాన్‌ కళాకారులు తీర్చిదిద్దారు. 8లో▸



చిన్ని కృష్ణులు.. చిట్టి గోపికలు

జిల్లాలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ప్రైవేటు విద్యాలయాలతోపాటు వివిధ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి.. ఉట్టి కొట్టే వేడుకలు నిర్వహించారు. చిన్ని కృష్ణులు, చిట్టి గోపికల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.5 /24.2

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అల్పపీడనం, రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

మౌలిక సదుపాయాలకు ప్రణాళిక రూపొందించాలి

- నిర్మల్‌ మున్సిపాలిటీకి రూ.25 కోట్ల ఎస్డీఎఫ్‌ నిధులు
- సమీక్ష సమావేశంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న మంత్రి, కలెక్టర్‌

నిర్మల్‌చైన్‌గేట్‌: జిల్లాలోని నిర్మల్‌ మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై కలెక్టర్‌ వరుణ్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీకృత కలెక్టరేట్‌లో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు నిధులు కేటాయించిందన్నారు. వాటికి సంబంధించిన పనుల ప్రణాళిక తయారుచేసి పంపాలని ఆదేశించారు. నిర్మల్‌ మున్సిపాలిటీకి స్పెషల్‌ డెవలప్‌మెంట్‌ ఫండ్‌ కింద రూ.25కోట్లు మంజూరయ్యాయన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పట్టణ సుందరీకరణ, సుందరమైన పార్క్‌ ఏర్పాటుకు ప్రణాళిక తయారు చేయాలన్నారు. లైటింగ్‌, రోడ్డు, డివైనింగ్‌, డ్రైనేజీ, శానిటేషన్‌ తదితర పనులు నిర్వహించేందుకు ప్రణాళికతో నివేదిక పంపాలన్నారు. శ్యామ్‌ఘడ్‌, నర్సాపూర్‌ నుంచి సోఫీనగర్‌ రోడ్‌, 42 వార్డుల్లో అవసరమైన మౌళిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనుల వివరాలు, పాత తహసీల్దార్‌ ఆఫీస్‌ వెనుక స్పోర్ట్స్‌ కోర్టు పనులకు ప్రణాళిక తయారు చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్‌ చైర్మన్‌ ఈశ్వర్‌, కమిషనర్‌ సీవీఎస్‌.రాజు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు 'ప్రయాస్‌'పై శిక్షణ

నిర్మల్‌ రూరల్‌: జిల్లాలోని 9, 10 తరగతిలో విద్యార్థులతోపాటు వారికి గణితం, సైన్స్‌ బోధించే ఉపాధ్యాయులకు శుక్రవారం టీశాట్‌ ద్వారా ప్రయాస్‌ అనే కార్యక్రమంపై శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి, జిల్లా సైన్స్‌ అధికారి వినోద్‌కుమార్‌ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిక్షణలో విద్యార్థుల్లో రీసెర్చ్‌ విధానం అభివృద్ధి చేయడానికి, కొత్త ఆవిష్కరణ ప్రాజెక్టులు తయారు చేసే విధానంపై హైదరాబాదు నుంచి శిక్షణ ఇస్తారన్నారు. ప్రతీ పాఠశాల నుంచి ప్రాజెక్టులను తయారుచేసి పంపించాల్సి ఉంటుందన్నారు. ఉత్తమమైన ప్రాజెక్టుకు రూ.50 వేల ప్రైజ్‌ మనీ ఇస్తారన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉట్టి కొట్టి.. బతుకమ్మ ఆడి



దీక్షా శిబిరం వద్ద కృష్ణాష్టమి వేడుకలు

నిర్మల్‌చైన్‌గేట్‌: తమ సమస్యలను పరిష్కరించాలని విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 11వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా కృష్ణాష్టమిని పురస్కరించుకుని విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగులు జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సమ్మె శిబిరం నందు ఉట్టి కొట్టే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌ ఫొటోను శ్రీకృష్ణుడిలా తయారు చేసి శిబిరం వద్ద ఏర్పాటు చేశారు. అనంతరం బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు.

భైంసాలో 19న వినాయక చవితి

భైంసాటౌన్‌: భైంసా ప్రాంతంలో ఈనెల 19 నుంచి వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలని భైంసా హిందూ ఉత్సవ సమితి సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు స్థానిక బబ్రూ మహారాజ్‌తో గురువారం సమావేశమయ్యారు. ఇక్కడి కాలమానం ప్రకారం 19న వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన, 27న నిమజ్జనం నిర్వహించాలని నిర్ణయించారు.

సరిహద్దుల్లో బందోబస్తు

- ఎన్నికల నేపథ్యంలో..పోలీస్‌ శాఖ ప్రత్యేక దృష్టి
- ప్రశాంతంగా ఎలక్షన్స్‌ పూర్తిచేసేలా చర్యలు
- అంతర్‌ జిల్లా, రాష్ట్ర పోలీసులతో సమన్వయం..
- రేపు బోధన్‌లో ఐదు జిల్లాల సమావేశం



మహారాష్ట్ర పోలీసులతో సమావేశమైన భైంసా ఏఎస్పీ

నిర్మల్‌: రానున్న అసెంబ్లీ ఎన్నికలు అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్‌ శాఖ సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా జిల్లా చుట్టూ ఉన్న జిల్లాలతోపాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర పోలీసులతోనూ సమావేశాలు నిర్వహిస్తోంది. మండల, నియోజకవర్గ, జిల్లా ఇలా వివిధ స్థాయిలలో పోలీసు అధికారులు పక్క జిల్లాలు, పక్కరాష్ట్రంలోని పోలీసులతో సమావేశమవుతున్నారు. ఇప్పటికే మండల, తాలూకా స్థాయిలలో సమావేశాలు పూర్తికాగా, జిల్లాస్థాయిలో ఎస్పీల సమావేశం శనివారం నిజామాబాద్‌ జిల్లా బోధన్‌లో నిర్వహించనున్నారు.

షెడ్యూల్‌ రాకముందే..

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు త్వరలోనే షెడ్యూల్‌ విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. అంతకుముందే పోలీసులు బందోబస్తుకు సన్నద్ధమవుతున్నారు. ప్రధానంగా అంతర్‌జిల్లాలో పెద్దగా ఇబ్బంది లేదు. కానీ.. పక్కనే ఉన్న జిల్లాలు, మహారాష్ట్రతో తరచూ శాంతిభద్రతలు, ఇతరత్రా శాఖపరమైన విషయాల్లో సమస్యలు తలెత్తుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇలాంటివి ఇబ్బంది పెట్టకుండా ఉండేందుకు ముందే ఆయా జిల్లాలు, రాష్ట్రాల అధికారులతో చర్చిస్తున్నారు. తాలూకా(నియోజకవర్గ) స్థాయిలో చర్చించినందున పూర్తిస్థాయిలో శనివారం ఎస్పీలు సమావేశం కానున్నారు.

ప్రశాంతంగా పూర్తిచేసేలా..

అసెంబ్లీ ఎన్నికలను ఎట్టిపరిస్థితుల్లో ప్రశాంతంగా పూర్తిచేసేందుకు పోలీస్‌శాఖ అన్నిరకాలుగా సిద్ధమవుతోంది. అంతర్‌జిల్లా, రాష్ట్ర చర్చల అనంతరం బందోబస్తుకు కావాల్సిన పోలీసు సిబ్బంది, సంబంధిత ఏర్పాట్లపైన చర్యలు చేపట్టనుంది. అంతర్‌జిల్లాల చర్చల్లో భాగంగా గురువారం రామగుండం కమిషనరేట్‌ పరిధిలోకి వచ్చే జిల్లాల ఎస్పీల సమావేశం నిర్వహించారు. ఇందులో ఖానాపూర్‌ నియోజకవర్గంలోని జన్నారం మండలానికి సంబంధించి జిల్లా ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌ హాజరయ్యారు. ఈనెల 9న నిజామాబాద్‌ జిల్లా బోధన్‌లో కామారెడ్డి, నిజామాబాద్‌, నిర్మల్‌, ఆదిలాబాద్‌ జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని నాందేడ్‌ జిల్లా ఎస్పీలు సమావేశం కానున్నారు.

ప్రధానంగా మహారాష్ట్రతో..

జిల్లాకు తూర్పున మంచిర్యాల, ఉత్తరాన ఆదిలాబాద్‌, దక్షిణాన జగిత్యాల, నిజామాబాద్‌ జిల్లాలు ఉన్నాయి. ఇక ప్రధానంగా పశ్చిమ భాగమంతా మహారాష్ట్రతో సరిహద్దును కలిగి ఉంది. సారంగపూర్‌, కుంటాల, కుభీర్‌, భైంసా, తానూరు, ముథోల్‌, బాసర్‌ మండలాలకు పశ్చిమవైపు మొత్తం మహారాష్ట్రనే ఉంది. ఈ మండలాలతోపాటు నర్సాపూర్‌, లోకేశ్వరం, దిలావర్‌పూర్‌, నిర్మల్‌రూరల్‌, నిర్మల్‌అర్బన్‌, మామడ వరకూ మహారాష్ట్రతో బలమైన సంబంధాలూ ఉన్నాయి. అలాగే పలురకాల నేరాలకూ రెండురాష్ట్రాల సరిహద్దు రాజమార్గంగా పేరుంది. ఇప్పటికే గంజాయి, దేశీదారు, మట్కా, బియ్యం అక్రమరవాణా, వాహనాల దొంగతనాలు తదితర కేసులు రెండురాష్ట్రాల మధ్య కొనసాగుతూనే ఉన్నాయి. గతంలో భైంసా తదితర ప్రాంతాల్లో చోటుచేసుకున్న అల్లర్ల నిందితులకు షెల్టర్లు ఇవ్వడానికీ మహారాష్ట్ర చాలా ఉపయోగపడింది.

సరిహద్దుపై నజర్‌..

జిల్లా చుట్టూ ఉన్న సరిహద్దులపై పోలీస్‌శాఖ ఇప్పటి నుంచే సీరియస్‌గా దృష్టిపెడుతోంది. పక్క జిల్లాలతోనూ నిత్యం నేరసంబంధిత, ఇతరత్రా విషయాలను షేర్‌ చేసుకుంటోంది. ఇకపై ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్ర పోలీసులతోనూ సత్సంబంధాలు కొనసాగిస్తూ నేరాలను తగ్గించేందుకు ప్రయత్నం చేస్తోంది. సరిహద్దుల వెంట ఎక్కడెక్కడ సమస్యాత్మక ప్రాంతాలు ఉన్నాయి. ఎక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్న విషయాలనూ ఇరు రాష్ట్రాల పోలీసుశాఖలు చర్చించుకుంటున్నాయి.

ఎన్నికల నేపథ్యంలో..



రానున్న అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా పూర్తిచేసేందుకు పోలీస్‌శాఖ అన్ని చర్యలు చేపడుతోంది. అందులో భాగంగానే అంతర్‌జిల్లాల, మహారాష్ట్ర పోలీసులతో కోఆర్డినేషన్‌ సమావేశాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శనివారం బోధన్‌లో ఎస్పీల సమావేశం ఏర్పాటు చేశారు.
– ప్రవీణ్‌కుమార్‌, ఎస్పీ

మెడికల్‌ కాలేజీకి ముహూర్తం

- 15న 'వర్చువల్‌'గా ప్రారంభించనున్న సీఎం
- రేపటితో కౌన్సెలింగ్‌ ప్రక్రియ పూర్తి
- ఇప్పటి దాకా 94 మందికి సీట్లు
- 16 నుంచి 'పరిచయ' తరగతులు



ప్రారంభానికి సిద్ధమైన మెడికల్‌ కాలేజీ

నిర్మల్‌: నిర్మల్‌ ప్రభుత్వ మెడికల్‌ కళాశాల ఈనెల 15న ప్రారంభంకానుంది. హైదరాబాద్‌ నుంచి సీఎం కేసీఆర్‌ వర్చువల్‌గా కొత్త మెడికల్‌ కాలేజీలను ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని భీమన్నగుట్ట సమీపంలో నిర్మించిన వైద్యకళాశాలనూ ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు మెడికల్‌ కళాశాలల్లో ప్రవేశాల కోసం చేపట్టిన కౌన్సెలింగ్‌ ప్రక్రియ గురువారమే పూర్తికాగా, వైద్యాధికారులు శుక్రవారం సాయంత్రం వరకు ఒకరోజు పొడిగించారు.

94 సీట్లు భర్తీ..

నిర్మల్‌ మెడికల్‌ కళాశాలలో వందసీట్ల కోసం చేపట్టిన కౌన్సెలింగ్‌ ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. శుక్రవారం సాయంత్రంతో మొత్తం పూర్తికానుంది. మొత్తం వంద సీట్లకు ఆలిండియా కోటాలో పది సీట్లకు ప్రవేశాలు కల్పించనున్నారు. ఇక రాష్ట్రకోటాలో 90 సీట్లకు 84 సీట్లు భర్తీ చేశారు. ఇంకా రాష్ట్ర కోటాలో ఒకటి, ఆలిండియా కోటాలో ఐదు సీట్లు మిగిలాయి. వీటి భర్తీకి శుక్రవారం సాయంత్రం వరకు గడువు ఉంది.

16 నుంచి క్లాసులు..

ఈనెల 15న ముఖ్యమంత్రి కేసీఆర్‌ వర్చువల్‌ విధానంలో మెడికల్‌ కాలేజీని ప్రారంభించనున్నారు. అనంతరం 16 నుంచి కళాశాలలో కొత్త విద్యార్థులకు పక్షం రోజులపాటు పరిచయ(ఇంట్రడక్షన్‌) తరగతులు నిర్వహించనున్నారు. అక్టోబర్‌ ఒకటి నుంచి రెగ్యులర్‌ క్లాసులు ప్రారంభించనున్నట్లు వైద్యకళాశాల అధికారులు పేర్కొన్నారు.

ప్రారంభానికి సిద్ధం..



మెడికల్‌ కాలేజీలకు సంబంధించి రేపటితో కౌన్సెలింగ్‌ ప్రక్రియ పూర్తి కానుంది. కళాశాలను ఈనెల 15న వర్చువల్‌ విధానంలో సీఎం కేసీఆర్‌ ప్రారంభించనున్నారు. అనంతరం 16 నుంచి ఇంట్రడక్షన్‌ క్లాసులు, వచ్చేనెల ఒకటి నుంచి రెగ్యులర్‌ క్లాసులు ప్రారంభమవుతాయి. – జీవీడీఎస్‌ ప్రసాద్‌, ప్రిన్సిపాల్‌, వైద్యకళాశాల

నిరుద్యోగుల్లో నిరుత్సాహం..!



పోస్టుల సంఖ్య పెంచాలని సమీకృత కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేస్తున్న డీఎడ్‌, బీఎడ్‌ అభ్యర్థులు

- ఉపాధ్యాయ ఖాళీల తకరారుతో కలవరం..
- జిల్లాలో కేవలం 115 ఖాళీలే చూపిన సర్కార్‌
- పోస్టులు పెంచాలంటున్న బీఈడీ, డీఈడీ అభ్యర్థులు

నిర్మల్‌ఖిల్లా: బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్‌ విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం సమాయాత్తమవుతోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2017లో టీఆర్టీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిన ప్రభుత్వం మళ్లీ ఆరేళ్ల తర్వాత ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ ఇవ్వాలని నిర్ణయించింది. ఈనెల 15 తర్వాత నోటిఫికేషన్‌ విడుదల చేసేలా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అయితే ఈసారి నోటిఫికేషన్‌లో చాలా తక్కువ పోస్టులు చూపడంపై నిరుద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ రాష్ట్రవ్యాప్తంగా 13,500 పోస్టులు ఖాళీ ఉన్నట్లు అసెంబ్లీలో ప్రకటించారు. కానీ, తాజాగా విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాత్రం కేవలం 5,089 పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆర్థిక శాఖ కూడా ఆమోదం తెలిపింది. దీంతో అభ్యర్థుల్లో నిరుత్సాహం నెలకొంది.

జిల్లాలో 115 పోస్టులే..

పాఠశాల విద్యాశాఖ లెక్కల ప్రకారం నిర్మల్‌ జిల్లాకు కేవలం 115 పోస్టులకు మాత్రమే ఖాళీలు చూపించారు. వీటిలో 91 ఎస్‌జీటీ పోస్టులు ఉండగా 16 స్కూల్‌ అసిస్టెంట్‌ పోస్టులు, 4 భాషా పండిత పోస్టులు, 4 పీఈటీ పోస్టులు ఉన్నాయి. వీటికే ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది. జిల్లాస్థాయి ఎంపిక కమిటీ (డీఎస్సీ) ద్వారా ఈ పోస్టులకు నియామక ప్రక్రియ చేపట్టనున్నారు. దీంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. పోస్టుల సంఖ్యలను పెంచాలంటూ విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు. జిల్లాలో దాదాపు 461 ఖాళీల జాబితాను ఆమోదం కోసం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖకు నివేదించగా, కేవలం 115 పోస్టులకు మాత్రమే ఆర్థిక శాఖ ఆమోదం తెలుపడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పోస్టులు పెంచాలంటున్న అభ్యర్థులు..

జిల్లాలో బదిలీలు పదోన్నతుల ప్రక్రియ షెడ్యూల్‌ ప్రకారం శరవేగంగా కొనసాగుతుంది. జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఖాళీల ప్రకారమే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని అభ్యర్థులు అంటున్నారు. ఇంత తక్కువ సంఖ్యలో పోస్టులు ఉంటే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎస్‌జీటీ పోస్టులు 235 చూపగా, ప్రస్తుతం 91 మాత్రమే చూపారు. పోస్టులు పెంచాలని డీఎడ్‌ అభ్యర్థులు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్‌ రవీందర్‌ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు.

డీఈడీ అభ్యర్థులకే ఎస్‌జీటీ పోస్టులు..

ఎస్‌జీటీ పోస్టులకు డీఈడీ పూర్తి చేసిన వారు మాత్రమే అర్హులని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో ఎన్‌సీటీఈ కూడా నియమావళిని సవరించింది. ఈమేరకే మరో పది రోజుల్లో నోటిఫికేషన్‌ వెలువడనుంది. మరోవైపు బీఈడీ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఇటు ఎస్‌జీటీ పోస్టులకు అర్హత కోల్పోయి, అటు స్కూల్‌ అసిస్టెంట్‌ పోస్టుల సంఖ్య అతి తక్కువగా ఉండడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. స్కూల్‌ అసిస్టెంట్‌ అన్ని సబ్జెక్టులు కలిపి కేవలం 16 పోస్టులు మాత్రమే భర్తీ చేయనున్నారు. వీటిల్లో కేటగిరీల వారీగా పోను కేవలం ఒక్క సబ్జెక్టుకు ఒకటి, అర పోస్టులు ఉండనున్నాయి.

పోస్టుల సంఖ్య పెంచాలి..



ఆరేళ్ల తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్‌ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో ఎస్‌జీటీ ఖాళీలు అనేకం ఉన్నాయి. కానీ కేవలం 91 పోస్టులకు మాత్రమే ఆర్థిక శాఖ ఆమోదం తెలుపడం నిరుత్సాహానికి గురిచేస్తుంది. ప్రస్తుతం పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతుండగా మరిన్ని ఖాళీలు ఉండనున్నాయి. వీటిని కూడా ఇదే నోటిఫికేషన్‌కు కలిపి భర్తీ చేయాలి.
– సునీల్‌, అభ్యర్థి, నిర్మల్‌

స్కూల్‌ అసిస్టెంట్‌ ఖాళీలు చాలా తక్కువ..



ఎస్‌జీటీ పోస్టులకు బీఈడీ అర్హతను తొలగించడంతో మేము స్కూల్‌ అసిస్టెంట్‌ పోస్టులకు మాత్రమే అర్హులం. జిల్లాలో స్కూల్‌ అసిస్టెంట్‌ పోస్టులు తక్కువగా ఉన్నాయి. దీంతో దేనికి ప్రిపేర్‌ కావాలో తెలియడం లేదు. నాలుగేళ్లుగా ప్రిపరేషన్‌లో ఉన్నాం. విద్యాశాఖ స్కూల్‌ అసిస్టెంట్‌ పోస్టులు పెంచాలి.
– దాసరి గణేశ్‌, అభ్యర్థి, కౌట్ల–బి, సారంగాపూర్‌ మండలం

ఆమోదం పొందిన జిల్లాలోని ఖాళీల వివరాలు..

స్కూల్‌ అసిస్టెంట్‌	ఎస్జీటీ	భాషాపండితులు	పీఈటీలు	మొత్తం
16	91	4	4	115

బదిలీలకు 1,920 దరఖాస్తులు

- హార్డ్‌ కాపీలు సమర్పించిన ఉపాధ్యాయులు
- సజావుగా బదిలీల ప్రక్రియ



బదిలీల ప్రక్రియను పరిశీలిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్‌ రూరల్‌: జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతుల ప్రక్రియ వేగవంతమైంది. బదిలీ కోసం 1,920 మంది ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. గతంలో 1,780 మంది దరఖాస్తు చేసుకోగా తాజాగా 140 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా ఎంఈవోల ద్వారా తమ హార్డు కాపీలను డీఈఓ కార్యాలయానికి పంపించారు. ఆ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించేందుకు అధికారులు సీనియర్‌ పీజీ ప్రధానోపాధ్యాయులతోపాటు, ఉపాధ్యాయులను కమిటీగా నియమించారు.

అక్కడ అభ్యర్థులే ఎమ్మెల్యేలు !

- మూడు చోట్ల సిట్టింగ్‌ ఎమ్మెల్యేలకు కష్టాలు
- కొత్త అభ్యర్థులకే జై కొడుతున్న పార్టీ కేడర్‌
- ప్రభుత్వ పథకాల ఎంపికలోనూ ఇరకాటం
- పదవి ఉండగానే 'పనులు' పూర్తి చేసేలా ప్లాన్‌

వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అధికార బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థులను ఆ పార్టీ అధినేత సీఎం కేసీఆర్‌ ప్రకటించారు. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో ఆసిఫాబాద్‌, ఖానాపూర్‌, బోథ్‌ నియోజకవర్గాల్లో సిట్టింగ్‌ ఎమ్మెల్యేలను కాదని కొత్తవారికి అవకాశం టికెట్‌ ఇచ్చారు. దీంతో పరిస్థితి మారిపోయింది. పార్టీ కేడర్‌, జనంతోపాటు కొందరు అధికారులు సైతం అభ్యర్థులకే ప్రాధాన్యత ఇస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లో అధికార బీఆర్‌ఎస్‌ పార్టీకి మూడు స్థానాల్లో పరిస్థితి భిన్నంగా ఉంది. టికెట్‌ దక్కిన నాయకులు, పోటీ చేసే అవకాశం కోల్పోయిన వారి మధ్య దూరం ఏర్పడుతోంది. బోథ్‌, ఖానాపూర్‌, ఆసిఫాబాద్‌ నియోజకవర్గాల్లో సిట్టింగ్‌ ఎమ్మెల్యేల ప్రాబల్యం క్రమంగా తగ్గిపోతోంది. ఇంకా వచ్చే జనవరి వరకు శాసనసభ్యుల పదవీ కాలం ఉన్నప్పటికీ అంతకుముందే పరిస్థితి మారిపోతోంది. ఇక ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారుల ఎంపిక, కేడర్‌ బాగోగులు, పార్టీ కార్యక్రమాలన్నీ అభ్యర్థుల కనుసన్నల్లోనే సాగుతున్నాయి.

కాంగ్రెస్‌లో చేరుతారని..

ఖానాపూర్‌ ఎమ్మెల్యే రేఖానాయక్‌ బీఆర్‌ఎస్‌లోనూ ఉండి, కాంగ్రెస్‌ పార్టీ టికెట్‌ కోసం దరఖాస్తు చేశారు. ఆమె భర్త రిటైర్డ్‌ రవాణాశాఖ అధికారి కాంగ్రెస్‌లో చేరి ఆసిఫాబాద్‌లో పట్టు పెంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఆమె కూడా కాంగ్రెస్‌లో చేరుతారని బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు క్రమంగా దూరమవుతూ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి జాన్సన్‌నాయక్‌కు దగ్గరవుతున్నారు. కొందరు ఇంకా కొన్నాళ్లు పదవీ కాలం ఉండడంతో అప్పటి వరకు వేచి చూద్దామనే ఆలోచనతోనూ ఉన్నారు. పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయి ఉంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పార్టీ మారితే ఎంతమంది ఆమె వెంట నడుస్తున్నారనేది తేలాల్సి ఉంది. ఇప్పటికే నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు అన్నీ కొత్త అభ్యర్థి పర్యవేక్షణలోనే జరుగుతున్నాయి.

సఖ్యత బయటకేనా?

బోథ్‌, ఆసిఫాబాద్‌ నియోజకవర్గాల్లో సిట్టింగ్‌ ఎమ్మెల్యేలు రాథోడ్‌ బాపురావు, ఆత్రం సక్కుకు ఈసారి టికెట్లు రాక, కోవ లక్ష్మి, అనిల్‌ జాదవ్‌కు అవకాశం లభించింది. ఈ రెండు చోట్ల అభ్యర్థులు, ఎమ్మెల్యేలు కలిసి పని చేయాలని పార్టీ అధిష్టానం ఆదేశించింది. వీరి మధ్య సఖ్యత కుదిరేలా చర్యలు చేపట్టింది. ఈ రెండు చోట్ల ఎమ్మెల్యేల ప్రాబల్యం తగ్గుతోంది. కుమురంభీం జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌ కోవ లక్ష్మి అధికార, పార్టీ కార్యక్రమాల్లో అన్నీ తానై ముందుకు సాగుతున్నారు. అటు అధికారులు, ఇటు కార్యకర్తలు ఏ పనికైనా ఆమెనే ముందు కలుస్తున్నారు. ఇక బోథ్‌లోనూ బాపురావు, అనిల్‌ జాదవ్‌ మధ్య సఖ్యత ఉందని బయటకు చెబుతున్నప్పటికీ లోపల పరిస్థితి వేరేలా ఉంది. తనకు పోటీ చేసే అవకాశం లేకుండా పోయిందనే భావనలో సిట్టింగ్‌ ఎమ్మెల్యే ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అనిల్‌ విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతున్నారు.

లబ్ధిదారుల ఎంపికలో ఇరకాటం

ఎన్నికల ముందు ప్రభుత్వం అందిస్తున్న బీసీ, మైనార్టీ బంధు, గొర్రెల పంపిణీ, గృహలక్ష్మి, దళిత బంధు రెండో విడతలో ఒక్కో నియోజకవర్గంలో 1100యూనిట్లు ఎంపిక చేయాల్సి ఉంది. గతంలో పార్టీ కేడర్‌కు మాటిచ్చిన ఎమ్మెల్యేలకు తాజా పరిణామాలతో ఆయా పథకాల్లో తాము కోరుకున్న వారిని ఎంపిక చేయాలంటే ఇబ్బందికరంగా మారింది. తన అనుకునేవారికి ఇస్తే కొత్త అభ్యర్థులతో సమస్య ఉంది. అలా కాక కొత్త అభ్యర్థి సూచించిన వారికి ఇస్తే తన కేడర్‌కు సమస్య ఉంది. ఈ క్రమంలో కొన్ని చోట్ల ఇద్దరు కలిసి లబ్ధిదారుల ఎంపికల్లో సగం సగం చొప్పున యూనిట్లను పంచుకున్నట్లు సమాచారం. మరోవైపు కొన్ని చోట్ల సంక్షేమ పథకాలు అందేలా చేస్తామని కొందరు డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాంటి వాళ్లు బయటకు వచ్చి ఫిర్యాదు చేస్తే పదవిలో ఉన్న వారు రాజకీయంగా ఇబ్బంది పాలయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే పదవీ కాలం వరకు వేచి చూసి ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారుల ఎంపిక, నిధులు ఖర్చయ్యే వరకు గుపచుప్‌గా ఉండాలని అనుకున్నట్లు సమాచారం.

ప్రాజెక్టుల నిర్మాణాలతో సస్యశ్యామలం

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- నిర్వాసితులకు చెక్కులు పంపిణీ



నిర్వాసితులకు చెక్కు అందిస్తున్న ఐకేరెడ్డి



శ్రీకృష్ణుని పూజలో ఇంద్రకరణ్‌ రెడ్డి దంపతులు

మామడ: బీఆర్‌ఎస్‌ పాలనలో నిర్మించిన ప్రాజెక్టులు, కాలువలతో సాగు విస్తీర్ణం పెరిగి తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలమైందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని లింగాపూర్‌, ఆరేపల్లి గ్రామాల్లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ 27వ ప్యాకేజీలో భాగంగా చేపట్టిన కాలువ, సదర్మాట్‌ బ్యారేజీ కింద భూములు కోల్పోయిన కమల్‌కోట్‌ నిర్వాసితులకు గురువారం పరిహారం చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్‌ నిర్మించి నీటిని శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి తెచ్చిన భగీరథుడు సీఎం కేసీఆర్‌ అన్నారు. కాళేశ్వరం నిర్మాణంతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతో కేసీఆర్‌ పనిచేస్తుంటే దేవుని ఆశీస్సులు, ప్రకృతి కటాక్షం లభిస్తుందని తెలిపారు. లింగాపూర్‌ గ్రామానికి చెందిన 19 మందికి రూ.58.20 లక్షలు, ఆరేపల్లి గ్రామానికి చెందిన 70 మందికి రూ.2.98 కోట్లు, కమల్‌కోట్‌ గ్రామానికి చెందిన పది మందికి రూ.3.28 కోట్లు మొత్తం 99 మందికి రూ.6.85 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశామని వివరించారు. ప్యాకేజీ 27 కాలువ నిర్మాణం దిమ్మదుర్తి వరకు నిర్మాణం పూర్తయితే ఇక్కడి ప్రాంత రైతులకు సాగునీటి సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ ఈఈ రామారావు, తహసీల్దార్‌ సర్ఫరాజ్‌ నవాజ్‌, ఎంపీడీవో రమేశ్‌, మాజీ డీసీసీబీ చైర్మన్‌ రాంకిషన్‌రెడ్డి, మండల పరిషత్‌ ఉపాధ్యక్షుడు ఏనుగు లింగారెడ్డి, నాయకులు భాస్కర్‌రావ్‌, నవీన్‌రావ్‌, సర్పంచులు గంగారాం, అరవింద్‌రావ్‌, రాందాస్‌, చంద్రశేఖర్‌గౌడ్‌, వికాస్‌రెడ్డి, అంబాజీ, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

గోసేవ గొప్ప పుణ్యం

నిర్మల్‌టౌన్‌: గోవులకు సేవ చేయడం గొప్ప పుణ్యమైన కార్యమని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గండి రామన్న ఆలయ ప్రాంగణంలో ఆలయ ట్రస్ట్‌ చైర్మన్‌ లక్కడి జగన్‌ మోహన్‌రెడ్డి, ఆయన సోదరుడు జైపాల్‌రెడ్డి తమ తల్లిదండ్రులైన లక్కడి కృష్ణవేణి– రాంరెడ్డి జ్ఞాపకార్థం నిర్మించిన గోశాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గోశాలలో ఏర్పాటు చేసిన కృష్ణుడి విగ్రహానికి మంత్రి సతీ సమేతంగా పూజలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గోవుని ముక్కోటి దేవతలుగా పూజిస్తారని, నల్లని గోవును ఆరాధిస్తే శుభం కలుగుతుందన్నారు. చారిత్రక, పౌరాణిక నేపథ్యం కలిగిన గండి రామన్న దత్తసాయి ఆలయ ప్రాంగణం దినదినాభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి రూ.2.25 కోట్లు మంజూరు చేశామన్నారు. ఆలయ చైర్మన్‌ జగన్‌మోహన్‌ రెడ్డి మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గోశాల నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎసీఎస్‌ చైర్మన్‌ రాజేందర్‌, దేవరకోట ఆలయ చైర్మన్‌ ఆమెడ శ్రీధర్‌, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ చిలుక రమణ, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు పాకాల రాంచందర్‌, పూజారి నరహరి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గణనాథుల ముస్తాబు

- చవితి పూజలకు గణేష్ విగ్రహాల తయారీ
- తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు
- జిల్లా కేంద్రంలో ప్రారంభమైన అమ్మకాలు



సిద్ధమైన వినాయక విగ్రహాలు

నిర్మల్ ఖిల్లా: విఘ్నాలకు అధిపతిగా పూజలందుకుంటున్న విఘ్ననాయకుడి విగ్రహాలు వినాయక చవితి కోసం ముస్తాబవుతున్నాయి. ఉత్సవ కమిటీల వారు కొనుగోలు చేసుకునేందుకు వీలుగా 2 నుంచి 16 అడుగుల వరకు గణేష్ విగ్రహాలను ఇప్పటికే రాజస్థాన్‌కు చెందిన కళాకారులు తీర్చిదిద్దారు. వివిధ రంగులు, వివిధ ఆకృతుల్లో తీర్చిదిద్ది ఉన్న గణనాథుడి విగ్రహాలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 18న వినాయక చవితిని పురస్కరించుకుని ఇప్పటికే స్థానిక బస్టాండ్ సమీపంలో, మంజులాపూర్‌లో తీర్చిదిద్ది అమ్మకాలకు సిద్ధంచేశారు. ఉత్సవ కమిటీలు యువజన సంఘాలు వారు తాము ఎంపిక చేసుకున్న విగ్రహాలకు ఇప్పటికే చెందిన విక్రయదారులకు అడ్వాన్స్‌లు చెల్లించేస్తున్నారు. మిగిలిన సొమ్మును విగ్రహాలను ఆయా గ్రామాలకు తరలించే ముందు ఇస్తారు. అమ్మకాల సందడితో ఇప్పటి నుంచే వినాయక చవితి కళ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. విగ్రహాల షాపుల వద్ద కొనుగోలుదారులతో నిండిపోతున్నాయి.

అనేక రూపాల్లో విగ్రహాలు...

వినాయక విగ్రహాలను నవరాత్రి ఉత్సవాల కోసం జిల్లా కేంద్రంలో అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. దాదాపు రూ.2వేల నుంచి రూ.30వేల వరకు ధరలు పలుకుతున్నాయి. ప్రధానంగా జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ ప్రాంతంలో ఖాళీ స్థలాలను అద్దెకు తీసుకొని గుడారాలను, షెడ్లను నిర్మించి అందులో విగ్రహాల తయారీని చేపట్టారు. ప్రస్తుతం ఈ విగ్రహాల రంగుల అద్దకాలు, తుదిమెరుగులు దిద్దుతున్నారు. ఈసారి ముడి సరుకుల ధరలు అమాంతం పెరగడంతో విగ్రహమూర్తుల ధరలు కూడా ఎక్కువగానే ఉన్నట్లు తయారీదారులు పేర్కొంటున్నారు.

అమ్మకానికి సిద్ధంగా ఉంచాం...

జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ ప్రాంతంలో కళాకారుల చేత విగ్రహాలను అందంగా తయారు చేయించాం. పలురకాల సైజుల్లోని వీటిని ప్రస్తుతం అమ్మకానికి సిద్ధంగా ఉంచాం. కళాకారుల చేత తయారు చేయించిన విగ్రహాల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీల వారు ఎంపిక చేసుకున్న విగ్రహాలకు అడ్వాన్స్ చెల్లించి వెళ్తున్నారు.
– పుప్పాల కృష్ణ, విక్రయదారుడు, నిర్మల్

కళాకారులకు ఉపాధి...

విగ్రహాల తయారీలో ప్రధానంగా రాజస్థాన్ నుంచి ఇక్కడికి వచ్చిన కళాకారులు చూపరులను ఆకట్టుకునే విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ముడి సరుకును తెప్పించిన తయారీదారులు కళాకారుల చేత విగ్రహాలను తయారు చేయిస్తున్నారు. మొదట ముడి సరుకుతో విగ్రహాలను మలిచిన అనంతరం వివిధ రంగులతో వాటిని తీర్చిదిద్ది అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. దీంతో అనేకమంది కళాకారులకు ఉపాధి దొరుకుతుంది. జిల్లాలోని ఆయా మండలాల నుంచి వచ్చిన ఉత్సవ కమిటీల వారు, యువజన సంఘాల వారు తదితరులు తాము ఎంపిక చేసుకున్న విగ్రహాలకు అడ్వాన్సులు చెల్లిస్తున్నారు.



విగ్రహాల తయారీలో యువతి

అడ్వాన్స్ చెల్లించాం



ప్రతీ ఏటా మిత్రమండలి ఆధ్వర్యంలో వినాయక ప్రతిష్ఠాపన చేసి నవరాత్రులు పూజలు చేస్తాం. ఇందులో భాగంగా ఈసారి వినాయక విగ్రహాన్ని ఎంపిక చేసుకొని ఇప్పటికే అడ్వాన్స్ చెల్లించాం. తయారీదారులు ఆ విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. వినాయక చవితి రోజున విగ్రహాన్ని తీసుకెళ్లి పూజలు చేసి ప్రతిష్ఠిస్తాం.
– కుస్తాపూర్ అరుణ్, చించోలి(బి), సారంగాపూర్

క్లుప్తంగా

సంబురంగా వందేళ్ల పుట్టినరోజు



మిఠాయిలు తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

కుంటాల: ఏడాదికి వచ్చే పుట్టిన రోజునే ఎంతో ఘనంగా జరుపుకుంటారు. వందేళ్ల పుట్టినరోజు వేడుకను ఆ కుటుంబ సభ్యులంతా ఎంతో సంతోషంగా నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ పట్వారి సాదుల లింబగిరి. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 100వ పుట్టిన రోజును గురువారం ఘనంగా జరుపుకున్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

తానూరు: మండలంలోని బెల్‌తరోడా గ్రామంలో గురువారం షార్ట్‌సర్క్యూట్‌తో దాసరి శంకర్ అనే వ్యక్తికి చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... బాధిత కుటుంబ సభ్యులు గురువారం ఉదయం భైంసాలోని తన బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం 5గంటల ప్రాంతంలో ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని టీవీ, కూలర్ ఫ్యాన్‌తో పాటు నిత్యావసర వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. గమనించి గ్రామస్తులు మంటలు ఆర్పివేసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తాగుడుకు బానిసై యువకుడి ఆత్మహత్య



సందీప్ (ఫైల్)

జైనథ్: మద్యానికి బానిసై యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని మాకోడ గ్రామంలో గురువారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం... రకాడే సందీప్(33) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానుకోవాలని మృతుడి తండ్రి రకాడే కారేబా, భార్య ఆశ తరుచుగా చెబుతున్నప్పటికీ మారడం లేదు. బుధవారం సైతం రాత్రి తాగి ఇంటికి వచ్చిన సందీప్‌ను కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో కోపంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన సందీప్ గుర్తు తెలియని పురుగుల మందు తాగి అర్ధ రాత్రి ఇంటికి వచ్చి వాంతులు చేసుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కాగా మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బేల: మండలంలోని బెదోడ గ్రామానికి చెందిన ప్రవీణ్ జగ్తప్(32) రోడ్డు ప్రమాదంలో మృతిచెందా డు. పోలీసుల వివరా ల ప్రకారం.. పనుల కోసం వచ్చిన ప్రవీణ్ జగ్తప్ బుధవారం రాత్రి బేల నుంచి బెదోడ గ్రామానికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. కాప్సి(బి), బెదోడ గ్రామాల మధ్యన బీటీ రోడ్డు మార్గంలోని ఓ కల్వర్టుని ఢీకొన్నాడు. తీవ్ర గాయాలపాలైన ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య స్వప్న, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలు

భైంసారూరల్: మండలంలోని మాటేగాం టోల్‌ప్లాజా సమీపంలో బైక్ అదుపు తప్పి రాములు అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. భైంసా పట్టణంలోని కిసాన్‌గల్లికి చెందిన రాములు రోజు మాదిరిగానే గురువారం తన ద్విచక్ర వాహనానికి బీడీగంప కట్టుకుని వానల్‌పాడ్ గ్రామంలోని బీడీ బ్రాంచ్ కార్యాలయానికి వెళ్తున్నాడు. మాటేగాం టోల్‌ప్లాజా వద్ద బైక్ అదుపుతప్పి కిందపడిపోవడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

108లో ప్రసవం



వాహనంలో తల్లీబిడ్డతో సిబ్బంది

ఖానాపూర్: 108లో గర్భిణి మగబిడ్డను ప్రసవించింది. మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని కొమ్ముతండాకు చెందిన మల్లేశ్ భార్య అరుణకు గురువారం పురిటి నొప్పులు వచ్చాయి. వెంటనే స్థానికులు 108లో నిర్మల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోని మండలంలోని ఎక్బాల్‌పూర్ గ్రామం వద్ద నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 సిబ్బంది వాహనంలోనే ప్రసవం చేశారు. రెండో కాన్పులో మహిళకు కుమారుడు జన్మించాడు. అనంతరం నిర్మల్‌లోని మెటర్నిటీ ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగానే ఉన్నారని సిబ్బంది తెలిపారు.

గడ్డి క్షేత్రాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వినోద్‌కుమార్

కడెం: అటవీ ప్రాంతాల్లో గడ్డి క్షేత్రాల పెంపకంపై ఎఫ్‌డీపీటీ వినోద్ కుమార్, గడ్డి క్షేత్రాల నిపుణుడు మురాద్ ఖర్ గురువారం అటవీ సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం కల్పకుంట వాస్తవ వద్ద టైగర్ రిజర్వ్ అధికారులు సెల్ఫీ దిగారు. పది నెలలుగా జీతాలు అందలేదని, అర్హులైన బేస్ క్యాంప్ సిబ్బందిని అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లుగా నియమించాలని ఎఫ్‌డీపీటీకి బెస్ క్యాంప్ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఇందులో అటవీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సరిహద్దులో నిఘా ఏర్పాటు చేయాలి


- రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి
- పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి

మంచిర్యాలక్రైం: రాబోయే అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే విధంగా ముందస్తుగా సరిహద్దు పోలీసు అధికారులు ఇప్పటి నుంచే సరికొత్త విధానంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. గురువారం సరిహద్దు ప్రాంతాలకు చెందిన ఆరు జిల్లాల ఎస్పీలతో రామగుండం పోలీసు కమిషనరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, మద్యం అమ్మకాలు, ఆయుధాలు, ఇతర అక్రమ రవాణా నియంత్రణపై దృష్టి సారించాలని అన్నారు. అంతర్‌జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు ప్రాంతాల గుర్తింపు, మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా, ఉమ్మడి కూంబింగ్ ఆపరేషన్ ఏరియా డామినేషన్ తదితర 13రకాల అంశాలపై చర్చించారు. సమావేశంలో పెద్దపెల్లి జిల్లా డీసీపీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, నిర్మల్ జిల్లా ఎస్పీ ప్రవీ ణ్‌కుమార్, కుమురంభీమ్ జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్, జగిత్యాల ఎస్పీ భాస్కర్, భూపాలపెల్లి జిల్లా ఎ స్పీ కర్ణాకర్, కరీంనగర్ రూరల్ ఏసీపీ టీ.కర్ణాకర్‌రా వు, సరిహద్దు ప్రాంతాల సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

కడెంకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



కడెం: కడెం ప్రాజెక్ట్‌కు గురువారం 12,438 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ఒక వరదగేటు ఎత్తి 10,359 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారురు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 696.200 అడుగుల నీటిమట్టం ఉంది.

అవగాహన ఏది..?

- పీఎంకేఎంవై కింద 60ఏళ్లు దాటిన రైతులకు రూ.3వేల పింఛన్
- పథకంపై అవగాహన కల్పించని అధికారులు
- ప్రీమియం చెల్లించని రైతులు
- లక్ష్యం నీరుగారుతున్న వైనం
- జిల్లాలో 1,94,000 మంది రైతులు



నిర్మల్‌చైన్‌గేట్: రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగానే రైతులకు చేదోడుగా ఉండేందుకు పింఛన్ అందించాలని కేంద్రం మూడేళ్ల క్రితం ప్రధాన మంత్రి కిసాన్ మన్ ధన్ యోజన పథకం (పీఎంకేఎంవై)ని ప్రారంభించింది. ఈ పథకంతో 60ఏళ్లు దాటిన వారికి ప్రతి నెలా రూ.3వేల పింఛన్ అందుతోంది. వయస్సు ఆధారంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. అయితే రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాలో మొత్తం 1,94,000 మంది రైతులు ఉన్నారు. వ్యవసాయ అధికారులు 2021లో మాత్రం మొక్కుబడిగా రైతులకు అవగాహన కల్పించారు. రెండేళ్లుగా ఈ పథకంపై రైతులకు ఎలాంటి అవగాహన కల్పించకపోవడంతో చాలామంది రైతులు నష్టపోతున్నారు. ఎంత మంది రైతులు అర్హులు, ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారో కూడా సంబంధిత వ్యవసాయశాఖ అధికారుల వద్ద రికార్డు లేకపోవడం గమనార్హం.

రూ.55తో ప్రారంభం..

ప్రధాన్ మంత్రి కిసాన్ మాన్ ధన్ యోజన పథకంలో చేరిన రైతులు నెలకు రూ.55 నుంచి కడుతూ రావాలి. గరిష్ఠంగా రూ.200 వరకు కట్టాల్సి రావొచ్చు. మీరు ఏ వయసులో పథకంలో చేరారనే అంశం ప్రాతిపదికన మీరు చెల్లించాల్సిన మొత్తం ఆధారపడి ఉంటుంది. 18 ఏళ్లలోనే స్కీమ్‌లో చేరితే నెలకు రూ.55 కడితే సరిపోతుంది. అదే 40ఏళ్ల వయసులో చేరితే నెలకు రూ.200 చెల్లించాలి. 60ఏళ్లు దాటిన తర్వాత ప్రతీ నెలా రూ.3వేలు వస్తాయి. నేరుగా బ్యాంక్ అకౌంట్లోనే డబ్బులు జమవుతాయి. చిన్న, సన్నకారు రైతులకు సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని తీసుకువచ్చారు.

అనర్హులు ఎవరంటే..

- చిన్న, సన్నకారు రైతులు అయినా చట్టబద్ధమై న సామాజిక భద్రత పథకాల్లో ఉన్న వారు, రాష్ట్ర ఉద్యోగ బీమా పథకం, ఎంప్లాయిమెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ స్కీంలో ఉన్నవారు.
- ప్రధానమంత్రి శ్రమయోగి మన్‌ధన్ యోజనలో ఉన్న రైతులు సంస్థాగత భూములు కలిగిన వారు.
- రైతు కుటుంబంలో ఎవరైన గతంలో లేదా ప్రస్తుతం రాజ్యాంగ పదవిలో ఉన్నవారు.
- కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు
- రూ.10వేలు పైన పింఛన్ పొందుతున్న వారు. ఆదాయ పన్ను చెల్లించేవారు అనర్హులు.

అర్హతలు, వివరాలిలా...

- ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు అర్హులు.
- 18 నుంచి 40ఏళ్ల లోపు మాత్రమే ఉండాలి.
- భార్యాభర్తలు విడి విడిగా దరఖాస్తు చేసుకోవచ్చు.
- వయస్సు ఆధారంగా ప్రతి నెలా రూ.55 నుంచి రూ.200 వరకు ప్రీమియం చెల్లించాలి.
- రైతు చెల్లించే ప్రీమియంతో సమానంగా కేంద్రం వాటా కూడా చెల్లిస్తుంది.
- దరఖాస్తు చేసుకున్న వారు 60ఏళ్లకు ముందుగా మరణిస్తే చెల్లించిన మొత్తం వడ్డీతో సహా తిరిగి నామినీకి చెల్లిస్తారు.
- రైతులు కామన్ సర్వీస్ సెంటర్లు, మీ సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవచ్చు.

చాలామందికి తెలియదు



రైతుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన కిసాన్ మన్‌ధన్ యోజన పథకంపై గ్రామాల్లోని రైతులకుఅవగాహన కల్పించకపోవడంతో చాలామందికి ఈ పథకం గురించి తెలియదు. ఈ పథకంతో రైతుకు కలిగే ప్రయోజనాలపై వ్యవసాయ అధికారులు అవగాహన కార్యక్రమాలు ప్రతీ గ్రామంలో నిర్వహించాలి.
– పుప్పాల రవి, రైతు పెంబి

అవగాహన కల్పించాలి



కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రధానమంత్రి కిసాన్ మన్‌ధన్ యోజన పథకంపై అవగాహన కల్పించాలి. చాలామంది రైతులకు ఈ పెన్షన్ స్కీమ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.
– రాజారెడ్డి, కుంటాల

రెప్పపాటులో మృత్యు ఒడికి..

- లారీ అదుపుతప్పి రోడ్డుపక్కన కూర్చున్న వారిపై బోల్తా..
- వాహనం కింద నలిగి తండ్రి, కొడుకు దుర్మరణం
- కళ్ల ముందే భర్త, కుమారుడి మృతితో గుండెలు పగిలేలా రోదించిన భార్య



భర్త, కుమారుడి మృతదేహాల వద్ద రోదిస్తున్న మంజుల

సాయికుమార్ (ఫైల్)



దాతల నుంచి డబ్బు పోగు చేస్తున్న స్థానికులు

జన్నారం: ప్రాణం నీటి బుడగలాంటిది అంటారు.. వాన రాక.. ప్రాణం పోక తెలియదు.. అనే సామెత ఇక్కడ అక్షర సత్యమైంది. అప్పటి వరకూ ఆట లాడుతూ ఉన్న కొడుకు, తనతో మాట్లాడుకుంటూ వచ్చిన భర్త.. రెప్పపాటులో మృత్యు ఒడికి చేరారు. లారీ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ఇద్దరినీ కబళించింది. కళ్ల ముందే లారీకింద నలిగి విగతజీవులుగా మారిన కొడుకు, భర్తను చూసి ఆతల్లి గుండె పగిలింది. నిర్జీవంగా పడి ఉన్న కొడుకును ముద్దాడుతూ 'అయ్యో కొడుకా.. లేరా.. ఊరికి పో దాం బిడ్డ... నీకు అప్పుడే నూరేళ్లు నిండాయా.. ఇప్పటి వరకూ నాతోనే ఆడుకుంటివి గదరా..' అంటూ రో దించిన తీరు అక్కడున్నవారిని కన్నీరు పె ట్టించింది. ముదు నెలల క్రితం కూతురును పో గొట్టుకున్న ఆ తల్లికి కొడుకు, భర్త కూడా దూరమయ్యారు. ఈ విషాద ఘటన మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగులో గురువారం జరిగింది.

స్వగ్రామానికి వెళ్దామని..

సంగారెడ్డి జిల్లా అంతారం మండలం అనంతారం గ్రామానికి చెందిన జోగి సాయికుమార్ (36) రెండేళ్లుగా జన్నారం మండలం రేండ్లగూడకు చెందిన కుతుబొద్దీన్ డెయిరీఫాంలో పనిచేస్తున్నాడు. అతనికి భార్య మంజుల, కుమారుడు లక్ష్మణ్ (7), కూతురు(ఒకటిన్నర సంవత్సరాలు)ఉన్నారు. మూడు నెలల క్రితం వీరి కూతురు అనారోగ్యంతో మృతి చెందింది. ఆ విషాదం నుంచి ఇంకా కోలుకోలేదు. కూతరు జ్ఞాపకాలు మర్చిపోయేందుకు తన సొంత గ్రామానికి వెల్దామని గురువారం భార్య, కొడుకుతో కలిసి రేండ్లగూడ నుంచి ఆటోలో కలమడుగుకు వచ్చాడు. అక్కడి నుంచి జగిత్యాల వరకు బస్సులో వెళ్లేందుకు బస్టాండ్‌లోని అంబేద్క ర్ విగ్రహం ఎదురుగా ఉన్న బెంచీపై కూర్చున్నారు.

దూసుకొచ్చిన లారీ..

ఈ సమయంలో నాగ్‌పూర్ నుంచి కోయంబత్తూరుకు దారంలోడ్‌తో వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి బస్టాండ్ సమీపంలో ఉన్న స్తంభాన్ని ఢీకొట్టి బెంచీపై కూర్చున్న సాయికుమార్, లక్ష్మణ్‌పై బోల్తా పడింది. ఇద్దరూ లారీ కింద నలిగి అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన స్థానికులు వెంటనే మృతదేహాలను బయటకు తీశారు. విషయం తెలుసుకున్న ఎస్సై సతీశ్, రెండో ఎస్సై సర్కార్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

మద్యం మత్తులో డ్రైవర్..

లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉండడం, అతి వేగంగా వాహనం నడుపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఉట్నూర్ మండలం బీర్సాయిపేటకు చెందిన లారీ డ్రైవర్ రమేశ్, క్లీనర్ అశోక్‌ను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. లారీ డ్రైవర్ మద్యం సేవించి అతివేగంగా అజాగ్రత్తగా నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు ఎస్సై తెలిపారు. డ్రైవర్, క్లీనర్, మరో వ్యక్తి పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

మూడు నెలల్లో ముగ్గురు మృతి..

మూడు నెలల వ్యవధిలో సాయికుమార్ కుటుంబంలో ముగ్గురు మృత్యువాతపడ్డారు. మృత్యువు ఆ కుటుంబాన్ని వెంటాడుతుందని స్థానికులు చర్చించుకున్నారు. 3నెలల క్రితం కూతురును అ నారోగ్యం కబళించగా, తాజాగా లారీ రూపంలో భర్త, కొడుకును బలితీసుకుంది. దీంతో సాయికుమార్ భార్య మంజుల గుండెలు పగిలేలా రోదిస్తోంది. గ్రామస్తులు విరాళాలు పోగుచేసి అందించారు.

క్షణాల్లో జరిగింది..



నేను బస్టాండ్‌లోని నాదుకాణంలో కటింగ్ చేస్తున్నా. ఒక్కసారిగా టైర్లు రోడ్డుపై రాక్కుంటూ వచ్చిన శబ్దం వినిపించడంతో బయటకు వచ్చి చూశా. ఒకే వైపునకు వంగిన లారీ కొంతదూరం వెళ్లి బెంచీపై కూర్చున్న ఇద్దరిపై బోల్తా పడింది. అప్పటికీ కేకలు వేసినా వారు గమనించలేదు. అంతా క్షణాల్లో జరిగిపోయింది.
– రవి, ప్రత్యక్ష సాక్షి, కలమడుగు